"కాయెంత" అని అడిగేడు. "అణా" అన్నాడు కొట్టువాడు. "ఇంకాతక్కువకు ఎక్కడదొరుకుతాయి?" అని అడిగాడు కొట్టువాడిని. తోటలోకివెళ్లితే దొరుకుతాయనిచెప్పేడు కొట్టువాడు. సరేఅని తోటకువెళ్లేడు లోభి. తోటమాలి ఈయననుచూడగానే ఎంతో అలసివచ్చేడని ఒకకొబ్బరిచెట్టు చూపించి దానికాయను వూరికేకోసుకోమని చెప్పేడు. వచ్చినలాభమునకు చాలాసంతోషించేడు లోభి. ఆచెట్టు వంకరగా ప్రక్కనేపారుచున్న కాలువలోనికి వ్రాలి వుంది. ఆచెట్టెక్కి కాయకొయ్యబోయాడు. ఇంతట్లో కాలుజారింది. గభాలున మట్టను పట్టుకుని వెళ్లాడుచున్నాడు. ఇంతట్లో ఒకమావటివాడు ఏనుగును నీళ్లకుతీసుకుని అక్కడికే వచ్చేడు. అప్పుడు లోభి "ఓమావటీ! నీకు రెండువేలవరహాలుయిస్తాను. నన్నురక్షించవలయును" అన్నాడు. సరే మంచిదేగదా అని ఏనుగుని నీళ్లలోనికిదింపి మావటివాడు ఏనుగు మీద నిలుచుని లోభికాళ్లుపట్టుకున్నాడు. ఇంతట్లో ఏనుగుబెదరి మావటివాని కాళ్లక్రింద నుంచి లేచిపోయినది. అప్పుడు మావటివాడు "ఓలోభీ! నీకే నేను నాఏనుగునిఅమ్మి నాలుగువేలవరహాలిస్తాను. మట్ట గట్టిగాపట్టుకో" అన్నాడు. అప్పుడే ఒకగుఱ్ఱపువాడు అక్కడికివచ్చేడు. అప్పుడు మావటివాడు "ఓస్నేహితుడా? నీకు నేను నాలుగువేలవరహాలుయిస్తాను. నన్ను రక్షించవలసినది" అనెను. గుఱ్ఱపువాడు గుఱ్ఱమును నీటిలోదింపి దానిపై ఎక్కేడు. మావటివానికాళ్లుపట్టుకునేసరికి గుఱ్ఱము బెదిరి పారిపోయింది. ఇంకేముంది? అప్పుడు గుఱ్ఱపువాడు మావటివానితో "ఓమోయి! నేను నాగుఱ్ఱమునమ్మి నీకు నేను రెండువేలవరహాలనిస్తాను. గట్టిగపట్టుకో" అనెను. అంత మావటివాడు లోభితో "ఏమోయి! నీకు మొత్తము గుఱ్ఱపువాడిది నాదికలిపియిస్తాను. మట్టగట్టిగా పట్టుకో" అన్నాడు. తరువాత లోభి తనకంత డబ్బు రానున్నదని చాలాసంతోషించేడు. అంతే ఆరువేలవరహాలు "యిన్ని" అవుతాయని సంతోషముపట్టలేక రెండుచేతులు విడిచిపెట్టేడు. ముగ్గురు ఏటిలోపడిచచ్చేరు. కథకంచికి వెళ్లింది. మనం యిక్కడేవున్నాము.

## ప్రాణభీతి

శ్రీమతి గాడీదమడుగు శారదాంబగారు

అనగా అనగా ఒక వూళ్లో ఒకబీదబ్రాహ్మణుడు. ఆబ్రాహ్మణునికి సంతానము అరడజనుకు జాస్తిగా ఉండడంచేత కుటుంబసంరక్షణార్థం చాలా కష్టపడేవాడు. బీదవాడైనప్పటికీ ఏదినం సంపాదన ఆదినానికే కాని ఎక్కువ సంపాదించి తన తదనంతరం కొమాళ్లకుపెట్టి పోదామనేవాడుకాడు ఆబ్రాహ్మణుడు. ఒకరోజుప్రొద్దున్నే వంటచెరుకుల కోసరం చేరువనుండు అడవికి భార్యాసమేతుడై బ్రాహ్మణుడు వెళ్లుచుండగా అకస్మాత్తుగా ఒకచెట్టుక్రింద ధనరాశికనపడింది వాళ్లిద్దరికి. బ్రాహ్మణునిగుండెలు హడలిపోయాయి. "అయ్యో! ఇక్కడ ప్రాణభీతివుందే! ఇక్కడ ఉండడం మోసం" అని భీతిచెందినవానిమాదిరి భార్యను లాగుతూ పరుగెత్తేడు బ్రాహ్మణుడు వెనక్కుఅయినా తిరిగిచూడకుండా. వాళ్లిద్దరికీ యిద్దరు రాజకుమారులు ఎదురయ్యేరు. ఎదురుకావడంతోటే "అక్కడ ప్రాణభీతివుంది. జాగ్రత్త!" అని బ్రాహ్మణుడు హెచ్చరించేడు ఆరాజనందనులను. ప్రాణభీతి అనగా ఏలాంటిదో చూదామని ఆబ్రాహ్మణుని

835

వెంటేడుకొనిపోయ్యారు ఆవృక్షం సమీపానికి. బ్రాహ్మణుడు గడగడవణుకుతూ "అదిగోనయ్యా, ప్రాణభీతి" అని ధనముపైపుచూపి పరుగెత్తేడు. అంతట రాజకుమారులు బ్రాహ్మణుడు వెర్రివాడనుకున్నారు. ఇద్దరిమనస్సుల్లోను ఊహలు జనించడం మొదలైంది. రెండవవానిని మోసగించి ధనమంతయూ తానే అపహరించాలని బుద్ధిపుట్టింది యిద్దరికికూడాను. పెద్దవాడు చిన్నవానినిచూచి "ఓయి! ఇప్పటికే చాలాకాలమైనది. మనయిద్దరికి భోజనం యిక్కడికే తెమ్ము. భోజనం కుడిచినతర్వాత ఇంటికి ధనసమేతులమై వెళ్లవచ్చు"నని చిన్నవానిన్ని పంపివేసెను. పంపేసి యిలా ఆలోచించేడు: "తమ్ముడు అన్నం క్రిందపెట్టుసమయములో ఇదే కరవాలంతో వానిశిరస్సును ఖండించేస్తా. ఈధనమంతయూ నాకేదక్కును కదా!" చిన్నవాడు గృహాభిముఖుడై "నేను ఇంట్లోనే భుజించి పెద్దవానికి విషమిళితమైన అన్నం తీసుకపోతాను. పెద్దవాడు చచ్చును. ధనమంతయూ నాదే" ననుకొంటూ అలాగే తెచ్చేడు అన్నాన్ని. తమ్ముడు తలవంచడంతోనే తనకరవాలంతో తమ్ముని శిరస్సుఖండించేడు అన్న. "తమ్ముడుచచ్చేడు, ధనమంతయునాదే" ననుసంతోషంతో పర్వదినంలాగ భుజించివాడు తమ్ముడుతెచ్చినదానిని. విషం తలకెక్కింది. తానుకూడా నీల్గేడు. ధనమన్న ప్రాణభీతి సుమా!

## నువ్వా దొంగవే

శ్రీమతి ఆదుర్తి సత్యాబాయి గారు

(శిబిరంలో సోఫామీద అలగ్జాండరుచక్రవర్తి, ఎదురుగా కాళ్ళకి చేతులకి సంకెళ్ళతో ఒకముష్కరుడూ, వానికిచెరోప్రక్కా బోరలు విరుచుకుని ఇద్దరుసైనికులూ నిలువబడిఉంటారు.)

అలగ్జాండరు:—(సైనికునిచూస్తూ) వీడేనా తారాసియన్‌దొంగ? ఇన్నాళ్ళబట్టీ మనపల్లెల్ని దోచుకు తిరుగుతున్నాడు?

ముష్కరుడు:—అవును. నేనే తారాసియన్‌ను. వీరయోధుడను.

అల:—(చిరునవ్వుతో) వీరయోధుడవా? బందిపోటుదొంగవు. నరహంతకుడివి. దేశానికి విసపుపురుగువి. నీధైర్యాన్ని నేను ప్రశంసిస్తానుగాని నువ్వుచేసినపనులకిమాత్రం తగినశిక్ష విధిస్తేగాని నేను శాంతిపడలేను.

ముష్క:—అలగ్జాండరుచక్రవర్తికికూడా కోపంవచ్చే పనుల్ని నేనేమిచేశాను?

అల:—ఏమీఎరగనట్లు మాట్లాడుతావేమిటి? నాఆజ్ఞలను అతిక్రమించి నువ్వు నడవడంలేదూ? నాదేశశాంతికి నీవు భంగంకలిగించలేదూ? నీతోడి ప్రజల ధనధాన్యాలపహరించి వాళ్ళని క్షోభపెట్టలేదూ?

ముష్క:—అలగ్జాండరుచక్రవర్తీ! ఇప్పుడు నేను నీఅధీనంలోఉన్నఖైదీని. నీవేమన్నా నేను పడవలసిందే. నీవేశిక్షవిధించినా అనుభవించవలసిందే. కాని నాఆత్మమీద మాత్రం నువ్వు అధికారం చెలాయించలేవు. అంచేత నీకు జవాబిచ్చేటప్పుడుకూడా సర్వస్వతంత్రుడిలాగే మాట్లాడుతాను.

అల:—అలాగేమాట్లాడు. నేను సంభాషిస్తూఉన్నప్పుడు నాఅధికారబలంచేత ఎదుటివాడినోరుకట్టడం నామతంకాదు.

836